క్లుప్తంగా

నేటి నుంచి ఆలయ ఉత్సవాలు



ప్రారంభానికి ముస్తాబైన ఆలయం

నవాబుపేట: మండల పరిధి యావాపూర్ గ్రామంలో ఇటీవల నిర్మించిన శివాలయ ప్రారంభోత్సవ కార్యక్రమాలను చేపట్టనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఉత్సవం వెంకాచార్య(ఉమ్మెంతల) సంస్థాన్ వారి ఆదీనంలో జరుగుతుందని చెప్పారు. శుక్రవారం ఉదయం గణపతి పూజ, అఖండ దీపస్థాపనం, అంకురార్పణ, 23న గణపతిపూజ, రుద్రసహిత పంచసూక్త హోమాలు, 24న గణపతి స్థానం, మండపస్థిత, ఆవాహిత దేవీ దేవతాపూజ, సంస్కార తదితర కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. ఉత్సవాలకు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొనాలని కోరారు.

అసంపూర్తిగా పాఠశాల భవనం



నిర్మాణ పనులు పూర్తికాని పాఠశాల భవనం

తాండూరు రూరల్: మండల పరిధి చిట్టిఘనాపూర్‌లో ప్రభుత్వ పాఠశాల అదనపు గది నిర్మాణం మధ్యలో ఆగిపోయింది. గతంలో రూర్బన్ పథకం కింది ప్రభుత్వం పాఠశాల అదనపు గది నిర్మాణానికి నిధులు మంజూరు చేసింది. పనులు దక్కించుకున్న సదరు కాంట్రాక్టర్ నిర్మాణాన్ని అసంపూర్తిగా వదిలేశారు. కాగా.. ఇక్కడ ఒకటో తరగతి నుంచి ఐదు తరగతులు ఉన్నాయి. సుమారు 70 మంది విద్యార్థులు ఉన్నారు. ఒకే తరగతి గది ఉండటంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. దీంతో చేసేది లేక ఉపాధ్యాయులు.. చెట్లకింద కూర్చొబెట్టి పాఠాలు బోధిస్తున్నారు. అసంపూర్తిగా వదిలేసిన బడి భవనాన్ని పూర్తి చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

మాతృ భాషపై పట్టు సాధించాలి



విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తున్న ఉపాధ్యాయులు

దోమ: ప్రతి విద్యార్థి మాతృ భాషపై పట్టు సాధించాలని కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు వెంకట్ అన్నారు. బుధవారం మండల పరిధి బొంపల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో మాతృ భాష దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మాతృ భాషపై పట్టు సాధిస్తే, మిగిలిన భాషలను సులభంగా అర్థం చేసుకోవచ్చునని సూచించారు. తెలుగుపై పట్టు సాధిస్తూ.. భాష తియ్యదనం గురించి తెలుసుకోవాలని చెప్పారు. అనంతరం నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు షఫీ, ఉపాధ్యాయులు నీలసింగ్, రేణుక, సీఆర్పీ వెంకటేశ్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సీఎం సభకు కాంగ్రెస్ శ్రేణులు



కుల్కచర్ల: సభ వాల్‌పోస్టర్లతో కాంగ్రెస్ నేతలు

కుల్కచర్ల: చలో కోస్గి కార్యక్రమంలో భాగంగా బుధవారం మండల కేంద్రం నుంచి కాంగ్రెస్ శ్రేణులు భారీగా తరలివెళ్లారు. ఎమ్మెల్యే టి.రామ్మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ కార్యకర్తలు, నాయకులు సభకు వెళ్లారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. మాటల్లో కాకుండా చేతల్లో రాష్ట్రాన్ని అబివృద్ధి పథంలో ముందుకు తీసుకువెళ్లేందుకు కార్యచరణ మొదలైందని, అది మన ప్రాంతం నుంచే మొదలు కావడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ సత్యహరిశ్చంద్ర, డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి, బ్లాక్ టు అధ్యక్షుడు భరత్‌కుమార్, పార్టీ మండల అధ్యక్షుడు ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి గోపాల్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మహాపడి పూజ

దోమ: శివభక్తుల మహాపడి పూజ బుధవారం ఘనంగా జరిగింది. మండల పరిధి పాలేపల్లి గ్రామంలో ఓ పాత్రికేయుడు తన నివాసంలో ద్వాదశ జ్యోతిర్లింగాల మహాపడి పూజను నిర్వహించారు. ఈ సందర్భంగా శివభక్తులు భక్తి గీతాలను ఆలపించారు. కార్యక్రమంలో పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్ రెడ్డి పాల్గొని, స్వామి వారిని దర్శించుకున్నారు.

లక్షలు పోశారు.. నిర్లక్ష్యం చేశారు

కాంప్లెక్స్ ప్రారంభించి.. వృథాగా వదిలేశారు

- రెండేళ్లయినా తెరచుకోని దుకాణ సముదాయం
- ఉపాధి కోసం ఎదురు చూస్తున్న యువత
- పట్టించుకోని అధికారులు



మండల కేంద్రంలో నిరుపయోగంగా ఉన్న షాపింగ్ కాంప్లెక్స్



ప్రారంభోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన శిలా ఫలకం

పెద్దేముల్: అక్షరాల ఇరవై లక్షల రూపాయలు పోసి నిర్మించిన దుకాణ సముదాయం.. అధికారుల నిర్లక్ష్యంగా నిరుపయోగంగా మారింది. మండల పరిషత్ కార్యాలయానికి ఆర్థిక వనరులను సమకూర్చేందుకు, నిరుద్యోగులకు ఉపాధి కల్పించేందుకు రూ.20లక్షల జెడ్పీ నిధులతో షాపింగ్ కాంప్లెక్స్‌ను నిర్మించారు. డిసెంబర్ 2021లో ఆర్భాటంగా ప్రారంభించారు. కానీ.. అటు అద్దెకు ఇవ్వకుండా, ఇటు వేలం వేయకుండా అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారని, అద్దెకు ఇస్తే పలువురికి ఉపాధి దొరకడంతో పాటు, పరిషత్‌కు ఆదాయం సమకూరేదని పలువురు అభిప్రాయ పడుతున్నారు.

ఎదురు చూస్తున్న యువత

కాంప్లెక్స్ ప్రారంభం నాటి నుంచి అందులో వ్యాపారం చేసుకొని, ఉపాధి పొందాలని స్థానిక యువత ఎదురు చూస్తోంది. అందుకు పైరవీలు సైతం చేసినట్లు సమాచారం. రెవెన్యూ, మండల పరిషత్, వ్యవసాయ, ఉపాధి, విద్యుత్, పశువైద్య, మండల సమైక్య కార్యాలయాలకు దుకాణ సముదాయం సమీపంలో ఉండటంతో, అందులో అద్దె రూపేనా మడిగె తీసుకుని వ్యాపారం చేసుకోవాలని చాలా మంది ఎదురు చూస్తున్నారు. కానీ వినియోగంలోకి తీసుకువచ్చేందుకు అధికారులు చొరవ చూపడం లేదన్న ఆరోపణలు వస్తున్నాయి. ఇదిలా ఉండగా.. 20వ రోజుల క్రితం ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి దృష్టికి.. దుకాణ సముదాయం విషయం కాంగ్రెస్ నాయకులు తెచ్చారని, త్వరలో వాటిని వినియోగంలోకి తేనున్నట్లు సమాచారం. కాగా.. దుకాణ సముదాయ నిర్మాణ దారుడికి బిల్లు ఇవ్వనందు వలనే.. భవనం తాళాలు ఇవ్వటం లేదన్నట్లు తెలుస్తోంది.

వినియోగంలోకి తేవాలి



మండలానికి ఆర్థిక వనరులను సమకూర్చేందుకు నిర్మించిన దుకాణ సముదాయాన్ని వినియోగంలోకి తేవాలి. తద్వారా వెనుక బడిన యువతకు ఉపాధి దొరుకుతుంది. మడిగెల కోసం చాలా కాలంగా చాలా మంది ఎదురు చుస్తున్నారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లాం.

–ప్రవీణ్‌కుమార్, పెద్దేముల్

పారదర్శకంగా ఎంపిక చేయాలి



మండల కేంద్రంలో నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్‌ను వినియోగంలోకి తేవాలి. ఉపాధి లేక విద్యావంతులు సైతం వలస వెళ్తున్నారు. షట్లర్ల ఎంపిక ఎలాంటి పైరవీలకు తావులేకుండా, పారదర్శకంగా ఎంపిక చేయాలి. అప్పుడే సామాన్యులకు న్యాయం జరుగుతుంది.

– నజీర్, మండల కో–ఆప్షన్ సభ్యుడు, గాజీపూర్

పది రోజుల్లో వేలం..



దుకాణ సముదాయం నిరుపయోగంగా ఉన్న మాట వాస్తవమే. ఈ విషయాన్ని అధికారులకు చెప్పాం. పైరవీలకు తావు లేకుండా.. పది రోజుల్లో అందరి సమక్షంలో వేలం నిర్వహిస్తాం. అర్హులకు మడిగెలు ఇస్తాం. తద్వారా నిరుద్యోగులకు ఉపాధి దొరుకుతుంది. మండలానికి ఆదాయం సమకూరుతుంది.

–అనురాధ, ఎంపీపీ, పెద్దేముల్

మహరాజ్ ఆలయ అభివృద్ధికి కృషి

ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి



పూజా కార్యక్రమంలో ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి

తాండూరు టౌన్: సద్గురు పోట్లి మహరాజ్ దేవాలయ అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి అన్నారు. బుధవారం ఆయన పార్టీ నాయకులతో కలిసి ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం మాట్లాడారు. ఆలయ అభివృద్ధి విషయాన్ని దేవాలయ కమిటీ తన దృష్టికి తీసుకువచ్చిందని తెలిపారు. త్వరలో అన్ని విధాలా సహాయ సహకారాలు అందజేస్తానని చెప్పారు. ఎమ్మెల్యేతో నాయకులు మురళీకృష్ణ గౌడ్, బాల్‌రెడ్డి, నర్సింహులు తదితరులు ఉన్నారు. ఇదిలా ఉండగా.. కోస్గిలో జరిగిన సీఎం బహిరంగ సభకు పార్టీ నాయకులతో కలిసి వెళ్లారు. ఆయనతో నాయకులు లక్ష్మారెడ్డి, శరణబసప్ప, గోపాల్ రెడ్డి, రవిగౌడ్, హబీబ్ లాలా, వెంకటయ్య, చంద్రశేఖర్ ఉన్నారు.

రేపటి నుంచి ఎల్లమ్మ జాతర



పల్లకీ సేవలో అమ్మవారి ఊరేగింపు

కొడంగల్ రూరల్: పట్టణశివారులోని బండల ఎల్లమ్మ జాతర ఉత్సవాలు శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ సందర్భంగా బుధవారం సంప్రదాయబద్ధంగా పట్టణంలోని పటేల్ రాంరెడ్డి నివాసం నుంచి అమ్మవారిని పల్లకీలో దేవాలయానికి ఊరేగింపుగా తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా భక్తులు.. పల్లకీసేవ సాగుతున్న క్రమంలో నిండు కడువలతో నీటిని చల్లారు. శుక్రవారం అమ్మవారి షిడె, శనివారం ఆలయం చుట్టూ ఎడ్లబండ్ల ఊరేగింపు, ఆదివారం పెరుగుబసంతం తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.

పల్లెల అభివృద్ధికి ప్రాధాన్యత



సీసీరోడ్డు నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న నేతలు

కుల్కచర్ల: గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం తగిన ప్రాధాన్యత ఇస్తుందని ఎంపీపీ సత్యహరిశ్చంద్ర అన్నారు. బుధవారం మండల కేంద్రంలో రూ.5 లక్షల ఉపాధిహామీ నిధులతో సీసీరోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించి మాట్లాడారు. గ్రామాల అభివృద్ధికి, ముఖ్యంగా రోడ్ల నిర్మాణాలకు కాంగ్రెస్ ప్రభుత్వం నిధులు కేటాయించిందని తెలిపారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ కనకం మొగులయ్య, డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి, ఎంపీటీసీ ఆనందం, బ్లాక్ బి అధ్యక్షుడు భరత్‌కుమార్, పార్టీ మండల అధ్యక్షుడు ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి గోపాల్ నాయక్, జీపీ కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి, మాజీ సర్పంచ్ జోగు వెంకటయ్య, రజక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మోత్కూరు వెంకటేశ్, నాయకులు రాంరెడ్డి, గోవర్ధన్ రెడ్డి, పెంటమీది వెంకటయ్య, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నిత్య ధ్యానంతో మానసిక ప్రశాంతత



ధ్యానం చేయిస్తున్న ప్రచార కర్త

పూడూరు: మానవుడి జీవితంలో ధ్యానం చాలా అవసరమని పిరమిడ్ స్పిరిచువల్ సొసైటీ ధ్యాన ప్రచార కర్త నవీన్ అన్నారు. బుధవారం మండల పరిధి చన్గోముల్, కడుమూరు, మిట్టకంకల్, పోతిరెడ్డిపల్లి పాఠశాలల్లో విద్యార్థులు, గ్రామస్తులకు ధ్యానంపై అవగాహన కల్పించారు. నిత్య ధ్యానం వలన దీర్ఘకాలిక రుగ్మతలను దూరం చేయవచ్చని తెలిపారు. విద్యార్థులు ప్రతి రోజు 15 నిమిషాలు ధ్యానం చేస్తే.. ఏకాగ్రత, జ్ఞాపకశక్తి, రోగనిరోధక శక్తి పెరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు బాబు, చెన్నయ్య, వేణు, శ్రీనివాస్, అంజయ్య, ఆంజనేయరెడ్డి పాల్గొన్నారు.

రాష్ట్రాన్ని అప్పుల్లోకి నెట్టారు

గిరిజన సెల్ రాష్ట్ర కో ఆర్డినేటర్ రఘు, పీసీసీ సభ్యుడు బాబర్‌ఖాన్

షాద్‌నగర్: బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా పదేళ్లు రాష్ట్రాన్ని పరిపాలించి, అప్పుల్లోకి నెట్టారని కాంగ్రెస్ గిరిజన సెల్ రాష్ట్ర కో ఆర్డినేటర్ రఘు, పీసీసీ సభ్యుడు బాబర్‌ఖాన్ ఆరోపించారు. బుధవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. షాద్‌నగర్ సమావేశంలో మాజీ మంత్రి హరీశ్‌రావు మతిభ్రమించి మాట్లాడారన్నారు. సీఎం రేవంత్‌రెడ్డిపై బీఆర్ఎస్ నేతలు ఇష్టం వచ్చినట్లు మాట్లాడటం సరికాదన్నారు. బీఆర్ఎస్ అధికారంలోకి వస్తే దళితుడిని ముఖ్యమంత్రి చేస్తానని చెప్పి ప్రజలను మోసం చేసేన వ్యక్తి కేసీఆర్ అని విమర్శించారు. రైతులకు రుణ మాఫీ చేస్తామని చెప్పి బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేతులెత్తేసిన విషయాన్ని వారు గుర్తు చేశారు. ఇంటికో ఉద్యోగం అన్నారు? ఇచ్చారా? అని వారు ప్రశ్నించారు. కేసీఆర్ ప్రభుత్వం నిరుద్యోగులను నిండా ముంచిందన్నారు. ప్రజలకు మాయ మాటలు చెప్పి రాష్ట్రాన్ని అప్పుల్లో నెట్టిన ఘనత మాజీ సీఎం కేసీఆర్‌కే చెల్లిందన్నారు. ప్రజల్లో సీఎం రేవంత్‌రెడ్డికి పెరుగుతున్న ఆదరణ చూసి బీఆర్‌ఎస్ నేతలు ఓర్వలేకనే విమర్శలు చేస్తున్నారన్నారు. ఈ సమావేశంలో చెంది తిరుపతిరెడ్డి, బాల్‌రాజ్‌గౌడ్, శ్రీను నాయక్, గంగనమోని సత్తయ్య పాల్గొన్నారు.

సంకల్ప యాత్రకు స్వాగతం



నాయకులను సన్మానిస్తున్న బీజేపీ శ్రేణులు

పూడూరు: బీజేపీ విజయ సంకల్ప యాత్రకు మన్నెగుడ చౌరస్తాలో.. పార్టీ నేతలు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్రనేత బంగారు లక్ష్మణ్, మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, రాణిరుద్రమ, కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి, జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి, కిసాన్‌మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు మారుతికిరణ్ బూనేటిలను భారీ గజమాలతో సన్మానించారు. కార్యక్రమంలో సెన్సార్‌బోర్డ్ సభ్యుడు మల్లేశ్ పటేల్, పార్టీ మండల అధ్యక్షుడు అనిల్, జిల్లా నాయకులు వెంకటయ్య, రాఘువేందర్, రవీందర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించండి

చేవెళ్ల: గ్రామ పంచాయతీలలో పనిచేసే కార్మికులకు పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్ డిమాండ్ చేశారు. రంగారెడ్డి జిల్లా చేవెళ్లలో బుధవారం ఆయన మాట్లాడుతూ కార్మికులు చాలీచాలని వేతనాలకు ఇబ్బంది పడుతున్నారని, అలాంటి వారికి నెలనెలా వేతనం చెల్లించకపోతే వారు కుటుంబాలను ఎలా పోషించుకుంటారని ప్రశ్నించారు. పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలు, పిల్లల చదువులు, పోషణ, తదితర ఖర్చులు కార్మికులకు పెను భారంగా మారయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఉద్యోగులకు ప్రతినెల 1వ తేదీన జీతాలు చెల్లిస్తున్నట్లు గొప్పలు చెప్పుకుంటుందని ఎద్దేవా చేశారు. ప్రభుత్వం స్పందించి కార్మికుల వేతనాలు విడుదల చేయాలని కోరారు.

అంగవైకల్యం శరీరానికే.. ప్రతిభకు కాదు

- సంక్షేమ పథకాలను వినియోగించుకోండి
- కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న తిరుపతిరెడ్డి

కొడంగల్ రూరల్: అంగవైకల్యం శరీరానికే తప్ప.. ప్రతిభకు కాదని, ఇదే విషయాన్ని అనేక మంది నిరూపించారని కాంగ్రెస్ పార్టీ కొడంగల్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎ.తిరుపతిరెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నివాసంలో వికలాంగుల జాతీయ హక్కుల జాతీయ వేదిక (ఎన్‌పీఆర్‌డి) సంఘం సభ్యుల ఆధ్వర్యంలో నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను వికలాంగులు సద్వినియోగం చేసుకుని, అభ్యున్నతి పొందాలని సూచించారు. వికలాంగుల పరిరక్షణకు సంక్షేమ పథకాల్లో ప్రభుత్వం ఐదు శాతం రిజర్వేషన్లు కల్పిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో ఎన్‌పీఆర్‌డి జిల్లా అధ్యక్షుడు జె.దశరథ్, జిల్లా మహిళా కన్వీనర్ కె.సావిత్రమ్మ, మండల కార్యదర్శి ఎన్.మారుతి, కార్యదర్శి వి.రాజు, ఉపాధ్యక్షుడు బి.గోపాల్, సాయప్ప, సభ్యులు ఎండీ నయీమ్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిలో భాగస్వాములు కండి

ఎంపీటీసీ ఉమావతి



భూమిపూజ చేస్తున్న ఎంపీటీసీ, నాయకులు

కడ్తాల్: గ్రామాభివృద్ధిలో ప్రజలంతా భాగస్వాములు కావాలని ఎంపీటీసీ సభ్యురాలు ఉమావతి బుగ్గయ్యగౌడ్ కోరారు. బుధవారం మండలంలోని ఎక్వాయిపల్లిలో ఎన్ఆర్‌ఈజీఎస్ నిధులతో చేపట్టిన పలు సీసీరోడ్ల నిర్మాణానికి ఆమె భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ మాట్లాడుతూ.. సీసీరోడ్ల నిర్మాణానికి నిధుల మంజూరుకు కృషి చేసిన ఎమ్మెల్యే కసిరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ పాలనలో గ్రామాల అభివృద్ధి వేగవంతంగా జరుగుతుందన్నారు. కావునా ప్రజలంతా సహకరించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు సుమన్, యాదయ్య, రమేశ్‌నాయక్, కరుణాకర్, చోటే, వెంకటేశ్, బాలరాజు, అనిత, రాజు, జంగయ్య, నరేశ్, బీచ్యానాయక్, నరేశ్‌నాయక్ పాల్గొన్నారు.

సైబర్ నేరగాళ్లతో జాగ్రత్తగా ఉండాలి



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ అరవింద్

మోమిన్‌పేట: సైబర్ నేరగాళ్ల పట్ల జాగ్రత్తగా ఉండాలని ఎస్ఐ అరవింద్ అన్నారు. బుధవారం పోలీస్‌స్టేషన్ ఆవరణలో సైబర్ నేరాల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఎవరైనా సైబర్ నేరగాళ్ల బారిన పడితే.. వెంటనే 1930 నంబరుకు సమాచారం ఇవ్వాలని సూచించారు. మీ అకౌంటును ఫ్రీజ్ చేయిస్తామని తెలిపారు. ఉద్యోగాలు ఇప్పిస్తామని, ఇంటి దగ్గరే ఉండి వేలు సంపాదించవచ్చని వివధ రకాలుగా సైబర్ నేరగాళ్లు గాలం వేస్తుంటారని, వారి మాటలకు ఆకర్షితులు కావద్దని సూచించారు. మీ ఫోన్‌కు గూగుల్‌పే, ఫోన్‌పేలతో రూ.50 నుంచి రూ.200ల వరకు పంపించి, రాంగ్ నంబరుకు డబ్బులు పంపామని చెప్పి, తిరిగి గూగుల్‌పే, ఫోన్‌పేలతో పంపాలని కోరతారని, అలాంటి వాటిని తిరస్కరించాలని చెప్పారు. లేదంటే మనం పంపించిన వెంటనే మన ఖాతాలో ఉన్న డబ్బులను కాజేస్తారని చెప్పారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ దత్తాత్రి, కానిస్టేబుల్ మల్లేశ్ పాల్గొన్నారు.

తరగతి గదుల్లోనే దేశ భవిష్యత్

జెడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్



అదనపు తరగతి గదిని ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ, ఎంపీపీ తదితరులు

తలకొండపల్లి: తరగతి గదుల్లోనే దేశ భవిష్యత్తు ఇమిడి ఉందని జెడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్ అన్నారు. బుధవారం మండలంలోని జంగారెడ్డిపల్లి, పెద్దూర్‌తండాల ప్రాథమిక పాఠశాల్లో రూ. 20 లక్షల మండల పరిషత్ నిధులతో నిర్మించిన అదనపు తరగతుల ప్రారంభోత్సవ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిలుగా ఎంపీపీ తిర్మణీ నిర్మలతో కలిసి అదనపు గదులను వెంకటేశ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పిస్తూ, పాఠశాలల బలోపేతానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. క్రమశిక్షణతో కూడిన విద్యనభ్యసించి లక్ష్యాన్ని చేరుకోవాలని విద్యార్థులకు సూచించారు. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా బోధన ఉండాలన్నారు. అనంతరం జెడ్పీటీసీ, ఎంపీపీలను ఉపాధ్యాయులు సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీకాంత్, ఎంపీఓ రఘు, స్పెషల్ ఆఫీసర్ రమేష్‌నాయక్, మాజీ ఏఎంసీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీటీసీలు రమేష్, రఘు, మండల ఎంపీటీసీల సంఘం అధ్యక్షుడు ఎంపీటీసీ జోగు రమేష్, సోని, లఖ్యా, కో ఆప్షన్ సభ్యుడు ఇమ్రాన్, సింగిల్‌విండో డైరెక్టర్లు శేఖర్‌యాదవ్, హెచ్‌ఎంలు అనురాధ, పవన్‌కుమార్‌రెడ్డి, శ్రీశైలం, కార్యదర్శిలు జానయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదబీమా చెక్కు అందజేత

మీర్‌పేట: గ్రామీణ ప్రాంతాలకే కాకుండా పట్టణ ప్రాంత ప్రజలకు కూడా గాయత్రి బ్యాంకు సేవలందించడంలో కీలక పాత్ర పోషించడం అభినందనీయని మీర్‌పేట కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి అన్నారు. గాయత్రి కో ఆపరేటీవ్ అర్బన్ బ్యాంక్ ఖాతాదారు నల్లగొండ ధన్‌రాజ్ ఇటీవల ప్రమాదవశాత్తు మరణించగా, బుధవారం ఆయన భార్య జ్యోతికి ప్రమాదబీమా ద్వారా రూ.1 లక్ష చెక్కును విక్రంరెడ్డి అందజేశారు. ఖాతాదారులకు కనీస డిపాజిట్‌తోనూ బీమా సౌకర్యం కల్పిస్తూ పేద, మధ్య తరగతి ప్రజలకు ప్రమాద బీమా కల్పించడంపై హర్షం వ్యక్తంచేశారు.

‘ఈ రోడ్లపై నడవలేకపోతున్నాం..’



వీరారెడ్డిపల్లి రోడ్డు దుస్థితి

- మా ఊళ్లకు రోడ్లు వేయండి
- సిరిగిరిపేట్, వీరారెడ్డిపల్లి ప్రజల డిమాండ్

తాండూరు రూరల్: ‘పల్లెల రోడ్లు కంకరతేలి, అధ్వానంగా ఉన్నాయి. కనీసం కాలినడకన వెళ్లలేని దుస్థితి. మా ఊర్లకు బీటీరోడ్లు వేయండి’ అని గ్రామీణ ప్రాంత ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. తాండూరు మండలం సిరిగిరిపేట్, వీరారెడ్డిపల్లి గ్రామాలకు బీటీరోడ్డు లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. గతంలో ఉన్న రోడ్డు.. రూపం కోల్పోవడంతో గత ప్రభుత్వం, రోడ్డు నిర్మాణాలకు నిధులు మంజూరు చేసింది. పంచాయతీరాజ్ విభాగం నుంచి వీరారెడ్డిపల్లి వరకు రోడ్డు నిర్మాణానికి రూ.54 లక్షలు, సిరిగిరిపేట్ రోడ్డుకు రూ.39 లక్షలు కేటాయించారు. కానీ ఇప్పటి వరకు రోడ్డు వేసేందుకు కాంట్రాక్టర్ ముందుకు రావడం లేదు. కంకర తేలిన రోడ్లలో ప్రయాణించలేక పోతున్నామని, అత్యవసర సమయంలో అంబులెన్స్‌లు గ్రామాలకు రావడం లేదని వాహనదారులు, ప్రజలు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఇక వానాకాలంలో రోడ్డు బాధలు చెప్పలేనివని వాపోయారు. సంబంధిత అధికారులు స్పందించి, బీటీరోడ్డు నిర్మాణం చేపట్టేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఇదే విషయమై పంచాయతీ రాజ్ అధికారులను వివరణ కోరగా.. టెండర్లు పిలుస్తామని, కాంట్రాక్టర్లు ముందుకు వస్తే వర్షాకాలం లోపు రోడ్డు పూర్తి చేయిస్తామని చెప్పారు.